# కాన్వెంట్

## 'ఖజానా'

"నేను కాన్వెంట్ పెడితే బావుంటుందనుకుంటున్నాను.." అన్నారు శ్రీవారు ఆవకాయ పప్పులో కలుపుతూ.

నా చేతిలో చారుగిన్నె వేడికి చీ రంత పాడయింది. మౌనంగా ఆ గిన్నె టేబిల్ మీద పెట్టి గరిట కోసం వెనుతిరిగాను.

"మనం ముందు గదిలో సామానంత వెనక్కి...."

"వెనక్కి - అంటే ఈ కిచెన్ లోనికా ? ఇంకా ఎక్కడికన్నానా ? ఆ డైనింగ్ టేబిల్.. ఈ వంట బీరువా, ఆ మూసిన బట్టల పెట్టి, పిల్లల బట్టల పెట్టెలు, పుస్తకాల షెల్ఫ్, అద్దం, నూనె, సీసా, పౌడరు డబ్బా ఎన్ని సామానులు, ఎన్ని అవసరాలు. ఏవి మానేది ? ఈ రణరంగంలోనికి కొత్త సైన్యమా ?"

"ఎలాగో తంటాలు పడితే ఓ మూడు గదులు. అంటే ఆ గది, డ్రాయింగ్ రూమ్, బయట వరండాతో మూడు గదులు కాన్వెంట్‌కి కేటాయిస్తే-"

అంటే ఈయన నిజంగానే పెట్టేస్తున్నరన్నమాట ఇలాంటి స్వయం ఉపాధి పథకం ఒకటి ఆలోచిస్తారని ఊహించాను గాని మరీ కాన్వెంటే పెట్టేస్తారనుకోలేదు.

ఈయన తమ్ముడు - అంటే నాకు ముద్దుల మరిది - బి.కామ్ పాసయి టైపు లాంటి పరీక్షలు, ట్రైనింగ్ - అయ్యి మహా సముద్రం వంటి నిరుద్యోగ సైన్యంలో నిలిచాడు. చాలా పరీక్షలు రాశాడు గాని అవి కొన్ని కాన్సిల్ అయ్యాయనీ, కొన్ని అలానే ఉన్నాయనీ, కొన్నింటిని కంప్యూటర్ తినేసిందనీ వార్తలు. ఉద్యోగం కోసం ఓ పది వేలు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. ఉన్నా ప్రభుత్వపు సంకట స్థితిలో'. ఈ పాపం చుట్టుకోవడానికి ఎవ్వరూ ఒప్పుకోవడం లేదు.... అక్కడికీ వీళ్ళు బలవంతం చెయ్యగా ఒక రిద్దరు రెండేసి వేలకు పాపం చేశారు. కాని ఫలితం ఎంత నిజమో తెలియడం లేదు. మా మరిది ఐదేసి వందలు జేబులో వేసుకుని అప్లికేషన్ ఫారాలు కొనుక్కుని, ఫోటోస్టాట్ కాపీలు తీయించి, సర్టిఫికెట్స్ అన్నీ పెట్టి, నేటివిటీ సర్టిఫికెట్ కోసం నానా అగచాట్లూ పడి మధ్యమధ్యలో అరచేతులు తడిపి అప్లికేషన్ పోస్ట్ చేసి దాని వెనకాలే వెళ్ళి వచ్చేసే వాడు డబ్బు లయిపోయి. ఇలా ఒక అయిదారు తడవలు అయ్యాక ఆ డబ్బులన్నీ కూడుకుని ఎంత వేస్తో నిర్ణయించుకుని స్వయం ఉపాధి పథకాలు మొదలు పెట్టారు..నా మట్టుకు నాకు వీళ్ళు బట్టల కొట్టో, స్టీలు సామాను కొట్టో పెడితే బావుండు ననే ఆశ ఉంది గాని, శ్రీవారు ఆడవాళ్ళన్నా స్టీలు అన్నా సిల్కు అన్నా వ్యతిరేకిస్తారు. ఆదిలోనే హంసపాదు. ఊరుకున్నా.

"ఎంత ఆలోచించినా ఇంతకన్నా మార్గం కనపడటం లేదు" అని చెయ్యి కడిగేసుకుని వెళ్ళిపోయారు.

నక్కి నక్కి ఉన్న వా ళ్ళంత కిచెన్‌లో పడ్డారు.

మా మరిది వచ్చాడు. పిల్లలు "బాబాయ్ కాన్వెంట్... బాబాయ్ కాన్వెంటో" అని కాస్సేపు అరిచి ఆనందపడ్డారు.

వాళ్ళను నేను నోరు ముయ్య మన్నాను. మరిది "ఏ మంటా వదినా ?" అన్నాడు.

నే ననేది ఏమన్నా ఉన్నా లేకున్నా తన బాధ చెప్పుకోవడానికి.

'అన్నయ్య కాన్వెంట్ అంటున్నాడు. పిల్లలు ఆ బాధ మనం పడగలమా ఏమిటి ?' పెద్ద నిట్టూర్పు విడిచాడు.

ఈసారి నా క్కాస్త ఆనందం వేసింది. "స్టీలు సామాను, బట్టలు ఇలాంటి దైతే ఒక గది చాలు. మరీ ముందు గదిలో సామాను నా నెత్తి మీద పెట్టుకో నక్కర్లేదు."

"వద్దమ్మా. కాన్వెంటే పెట్టమను. కాన్వెంట్.. కాన్వెంట్.." పిల్ల లిద్దరూ ఏక కంఠంతో నినాదాలు ప్రారంభించారు.

"పే రేం పెడదాంరా ?" మా పెద్దాడు.

"పే రెందుకు ?" అని నాలిక్కరచుకుని చిన్నాడు ఆలోచించాడు. ఎంత ఆలోచించినా వాడికి లీల, బాల, మేరీ.. మోతీ లాంటి పేర్లే తట్టసాగాయి. దానితో మా పెద్దాడికి కోపం వచ్చి నోరు మూసుకోమని కసిరాడు.

"అందాకా బాబాయ్ కాన్వెంట్ అందాం" అన్నాడు.

"కాన్వెంట్ అంటూ పెట్టాక అది బాబాయ్ దైతే నేమి, అబ్బాయి దైతే నేమి లేరా.." అన్నాడు మరిది పెద్ద నిట్టూర్పు విడుస్తూ.

"అమ్మా.. మేము బాబాయ్ కాన్వెంట్ లోనే చదువుకుంటా మమ్మా." మా చిన్నాడు గారం చేశాడు.

"బాబాయ్ కాన్వెంట్‌లోనే చదువుకుంటాం. అదొక సమస్యటరా ?" కసిరాడు పెద్దాడు.

"మనకి బోల్డు డబ్బులు మిగులుతాయి. రిక్షా డబ్బులు, ఫీజులు అమ్మకి ఎంత లాభమో !" చిన్నాడి కూడిక.

"కుదర్దు.. ఆ డబ్బులు నేను తీసేసుకుని సైకిల్ కొనుక్కుంటాను." పెద్దాడి గుణకారం.

"వీల్లేదు.. నేనూ కొనుక్కుంటాను."

"నీ మొహం నీవు తొక్క లేవు. పడితే కాళ్ళు విరుగుతాయి."

"నీకే విరుగుతాయ్."

"హుష్." మా మరిది చాలా పెద్దగా నిట్టూర్చాడు.

కొంచెం సేపు ఇద్దరూ నిశ్శబ్దం అయ్యారు. మళ్ళీ మా చిన్నాడే గొణిగేడు - "అయితే నేను 'టేప్ రికార్డర్' కొనుక్కుంటా" నని.

బహుశా ఆ డబ్బులతో వాళ్ళు అవేమీ కొనకుండా చూడటం నా వల్ల కాదేమో ! వెధవాయిలు తెగ సరదా పడుతున్నారు.

"ఏమో వదినా. నాకేమిటో భయంగా ఉంది." గ్లాసుడు మంచినీళ్ళు గటగటా తాగేశాడు మరిది.


మా పిల్లకాయ లిద్దరికీ మంచి హుషారు వచ్చింది. బాబాయ్‌కి అటూ ఇటూ చేరారు.

"ను వ్వేం బాధ పడకు బాబాయ్. కాన్వెంట్ అంటే చాలా తేలిక."

పెద్దాడు ఓదార్చాడు.

"నీ వెప్పుడూ కాన్వెంట్‌కి వెళ్ళ లేదా ? అందుకే పాపం, భయంగా ఉందా !" మా చిన్నాడు పెరుగు చెయ్యి ఒకసారి నాకేసి నిక్కరు పైకి లాక్కున్నాడు ధైర్యంగా.

"అవును. అందులో బాబాయ్ ను వేమిటి ?" పెద్దాడి ప్రశ్న.



"నే నేమి ఉేవిటిరా ?" అని కొన్త వినుగ్గా ప్రశ్నించాడు మరిది.

"అదే. ఎన్నో క్లాసూ అని." మా చిన్నాడు మళ్ళీ చెయ్యి నాక్కోబోయాడు. కాని ఆ చెయ్యి నేను గట్టిగా పట్టేసుకుని కడిగేశాను గిన్నెలో. వాళ్ళ డాడీ ఈ వెధవ్వేషాలు చూస్తే వాళ్ళను వదిలేసి నన్ను చంపేస్తారు మరి !

"నోర్మూయ్ వెధవా !" గంయ్ మని లేచాడు పెద్దాడు. "కాన్వెంట్ బాబాయ్ పెడుతుంటే ఎన్నో



క్లాసంటా వేమిటి ?''

చిన్నాడికి కాన్వెంట్ అంటే క్లాసులు, పుస్తకాలే గుర్తు వస్తాయి. అందుకని బిక్కమొఖం వేసి మళ్ళీ చెయ్యి నాక్కోబోయాడు.

ఆ చెయ్యి వెనక్కి తిప్పి త డేసి కట్టెయ్యా లేమో ! వెధ వలవాటూ వీడూను.

''కాదు బాబాయ్. నీవు హెడ్మాస్టరువా ? మేనేజరువా ?''

''ఏమిటిరా తేడా ?'' మరిది బిక్కమొహం వేశాడు. తను రాసిన ఆబ్జక్టివ్ క్వశ్చన్స్‌లో లేదేమో ఇది.

''అదా. అబ్బో చాలా ఉంది.'' - అని వాళ్ళ బాబాయ్ ఎదురుగా వచ్చి సుఖంగా కూర్చున్నాడు పెద్దాడు.

''అవును. చాలా ఉంది.'' వంతపాడేసి మోచెయ్యి దగ్గర మొదలుపెట్టబోయాడు నాకడం చిన్నాడు.

నేను ఉపేక్షించి లాభం లేదని ఆ చెయ్యి పట్టుకుని కళ్ళ ల్లోకి చూశాను. వాడు అంత కన్నా స్పీడుగా చెయ్యి విదిలిం చేసుకున్నాడు.

ఈసారి పెద్ద నిట్టూర్పు మా పెద్దాడు వదిలాడు.

''పెద్ద తేడా లే దనుకో. అయినా హెడ్మాస్టరు, మానేజరు అని విడివిడిగా రెండు పాత్రలు వెయ్యడం - నీకు కష్టం. మరొకర్ని పెట్టుకోవాలన్నా కష్టం. అందు చేత నీకు నచ్చిన పేరు పెట్టుకుని - అంటే నీవు హెడ్మాస్టరుగా ఉంటావనుకో.''

మా మరిది తల వంచుకున్నాడు. కర్చీఫ్ కోసం వెదుక్కుంటున్నాడు.

''ఛ ఛ !. బాబాయ్ హెడ్మాస్ట రేమిటి ? ఇంకా చాలా ముసలి వాడు కాలేదుగా ?'' అన్నాడు మా చిన్నవాడు చిటికిన వేలు నోట్లో వేసుకుని.

ఒక్కసారి మా పెద్దాడు చిన్నాడి వైపు చూసి తల వంకించి తమ్ముడితో ఏకీభవించాడు. ''సరే. నీవు చెప్పినట్టే బాబాయ్‌ని మేనేజర్ అందాం.''

''నా వల్ల కా దొదినా !'' అన్నాడు తల విదిలించి నిట్టూర్చడం మరిచిపోయి మరిది.

''అయ్యమ్మో ! నీ వసలు అలా భయపడనే అక్కర్లేదు బాబాయ్.'' ఇద్దరూ ఓదార్చారు.

''నీ విప్పుడు మేనేజర్ వనుకో. చక్కగా నీట్‌గా తల దువ్వుకుని కుర్చీలో కూచోవాలి.''

''తెల్లని పౌడర్ రాసుకోవాలి.'' మా చిన్నాడుఈఅందించాడు.


''రాసుకుంటాడులే !'' మా పెద్దాడు కసిరాడు. ''ఏం బాబాయ్ నీ వలా కుర్చీలో కూర్చుంటావా ? బోల్డు మంది 'మా పిల్లల్ని చేర్చుకోండి, మా పిల్లల్ని చేర్చుకోండి' అని వస్తారు. నీవు దర్జాగా వాళ్ళ వంక చూసి, 'ఏ క్లాసు' అని అడగాలి. నాలుగు, అయిదు, ఆరు - అలాంటి తరగతు లనుకో - 'మీ అబ్బాయి చేత రిటన్ టెస్ట్ రాయించండి - రేపు పదో తారీఖున. ఆ టెస్ట్‌లో పాస్ అయితే చేర్చుకుంటాము. ఈలోగా అప్లికేషన్ ఫారమ్ పూర్తి చెయ్యండి. ఇవిగో పేపర్స్ ఈ మోడల్‌లో ఉంటా'యని కొన్ని కాగిత లివ్వాలి. ఇచ్చి వది రూపాయలు తీసేసుకో. చిన్న పిల్ల లనుకో - అంటే ఒకటో, ఎల్.కె.జి.యో ఏదో అనుకో. అప్పుడు నువ్వు చిన్న పిల్లాడిలా ముఖం పెట్టి నోరు బాగా సాగదీసి నవ్వేయాలి. ఆ పిల్లాడి భుజం మీద చెయ్యేసి లాగు, చొక్కా పైకి కిందకూ. పీకి గిలిగింతలు పెట్టాలి.

''కొంచెం చాకలెట్లు, రెండు మూడు బిస్కెట్లు పెట్టాలి.'' ఎప్పటి నుంచో చీకుతున్న బొటన వేలు తీసి చెప్పాడు మా చిన్నాడు. నే నా బొటన వేలు నీళ్ళతో కడిగి మడి చేశాను.

''సరేలే. వాణ్ణి వెంటనే చేర్చేసుకుని అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, పుస్తకాలకూ, పరీక్షలకూ, ఆయాకూ, కరెంట్, బోర్డు ఇలా బోల్డు ఖర్చులు చెప్పి వందలు కట్టిం చేసేసుకోవాలి. అలా నీ కెన్ని డబ్బులో ! నీవు మంచి బట్టలు కుట్టించుకోవచ్చు. మంచి బూట్లు కొనుక్కోవచ్చు. హొటల్ కెళ్ళి టిఫిన్ తినవచ్చు.'' మా పెద్దాడు వాళ్ళ బాబాయ్‌కి అన్ని రకాల సౌకర్యాలూ కలిగిస్తున్నాడు.

''బాబాయ్ ! నీవు సిగరెట్లు కూడా కొనుక్కోవచ్చు'' అని అతి రహస్యంగా ఇంట్లో మాత్రమే వినబడేటట్టు చెప్పాడు మా చిన్నాడు. చెప్పి బొటన వేలు కోసం చూసుకున్నాడు. నేను ఎంతో సమయస్ఫూర్తిగా ఆ వేలు చటుక్కున పట్టుకున్నాను. వాడు నా కేసి విసుగ్గా చూసేడు. వాడికి మా చెడ్డ చిరా కొచ్చింది.

''బాబాయ్.. నీవు మమ్మల్ని గాని ఉత్తినే చదవనివ్వకు. మా క్కూడా డబ్బులు పుచ్చేసుకో. నీకు చాలా ఖర్చు లున్నాయిగా ?'' అని సలహా




పడేశాడు.

''నాన్నగా రివ్వరురా.'' పెద్దాడి విచారం.

''ఇవ్వాలి. ఇవ్వకపోతే మనం ఊరుకోవద్దు. మనం చదువులే మానేద్దాం.''

వీరావేశంలో వా డా చెయ్యి మొత్తం లాగేసుకున్నాడు.

''అంతే బాబాయ్. నీ వేం జాలి పడకు.'' పెద్దాడి నిర్ణయం.

మా మరిది కనుబొమ్మలు పైకెత్తి రెండు మూడు సార్లు గట్టిగా నిట్టూర్చాడు.

''ఫీజులు బాగానే ఉన్నాయి గానిరా, పాఠాలు చెప్పొద్దూ ?'' పిల్ల లిద్దరూ ఆలోచనలో పడిపోయారు. కాస్సేపటికి మా పెద్దాడు ఊపిరి పీల్చుకున్నాడు. ''ఫర్లేదు బాబాయ్. నువ్వే కాసిన్ని క్లాసులు తీసేసుకో. సిక్స్త్ క్లాసు ఇంగ్లీషు, ఫోర్త్ క్లాసు తెలుగు, హిందీ - ఇలా నీకు రాకపోయినా పర్వాలేదు. ఎందుకంటే నీవు క్లాసుకి వెళ్ళేసరికి ఎవరో ఒకళ్ళు ధన్ ధన్ మని వచ్చేసి 'మా పిల్లాణ్ణి చేర్చుకోం' డని అంటారు. నీవు క్లాసు 'నిశ్శబ్దం' అని చెప్పి వెళ్ళిపోవచ్చు. ఆ గంటకి వాళ్ళు వెళ్ళిపోత రు. తరువాత హిందీ క్లా సనుకో. క్లాసులో బెత్తం చూపించి 'అక్షరాలు ఎవరికి వచ్చురా' అని అడుగు. కొంతమంది లేచి నిలబడత రు. అందులో ఒకణ్ణి బెత్తంతో చూపించి 'నీవు అక్షరాలు రాయి' అని చెప్పి, పక్కవాణ్ణి గుణింతాలు రాయమను బోర్డు మీద. ఇంతలో బయట నుంచి పిలుస్తారు.. 'మా వాడు పొద్దుట భోజనం చేసి రాలేదండీ' అని - అప్పుడు నీవు.. 'ఎవరు శీనా ? వెధవకి భలే ఇష్టమండీ చదువంటే. ఈమధ్య అల్లరి కూడా మానేశాడు..' అని నవ్వు. ఇంతలో ఇంకొకళ్ళు. 'మా లక్ష్మి ఏం చేస్తుందండీ' అని అడుగుత రు. 'ఏడుపు మానేసి చక్కగా చదువుకుంటోంది. క్లాస్ ఫస్ట్ ఎప్పుడూ ఆ పిల్లే' అనేయ్. ఇంతలో ఇంకొకడు. 'మా ఎంకటేశం ఏం చేస్తున్నాడూ' అంటాడు. రెండో తరగత, నాలుగో తరగత ? ఒరేయ్ బాలాజీ ! వెంకటేశం ఎక్కడరా'' అని పక్క క్లాసులో అడుగు. అప్పుడు చెబుత రు. చెప్పగానే పెద్ద నవ్వు నవ్వి 'నీవు పెద్ద ఎవడివో అనుకున్నాను. నువ్వేటరా వెంకటేశ్వర్లూ ?' అని మళ్ళీ నవ్వేయి. మళ్ళీ నవ్వేయి.

నాకు నవ్వాగ లేదు. మా మరిదీ నవ్వేడు తన నిరుద్యోగం సంగతి మరిచి పోయి.

కాస్సేపటికి తేరుకుని ''వెధవల్లారా !'' అని వాళ్ళను కసిరాను. ''బయటికి పొండ''ని ఆజ్ఞాపించాను.

మా పెద్దాడు బిక్కమొఖం వేసుకుని అయిష్టంగా కదిలాడు. మా చిన్నాడు వాడి చెయ్యి వాడి కూడా తీసుకెళ్తున్నందు వల్ల కాస్త తృప్తిగా వెళ్ళాడు. ఎప్పటి నుంచో కెలుకుతున్న ఆ అన్నంలో మజ్జిగ పోశాను. అయినా కెలకడం మానలేదు.

''వదినా.. నీ కే మనిపిస్తుంది ?''

నా కేమనిపిస్తుంది ? ఈ ఇద్దరి పిల్లల్నీ ఆదివారంనాడు భరించలేక ఈ సెల వెందు కొచ్చిందని ప్రభుత్వాన్ని తెగ తిట్టుకుంటుంటాను నేను. నా సమస్యలు నావి. నా పని తెమలాలి. కాస్త తీరిక దొరికితే మార్నింగ్ షోకి వెళ్ళాలి. ఏమీ వీలు లేకుంటే నడుం వాల్చాలి. ఇవన్నీ ఈ మరిదికి చెప్తే అర్థం అయ్యే సమస్యలా ? చిన్నగా నవ్వాను.

''కా దొదినా. కాన్వెంట్‌కి ఇ ళ్ళుంది. నే నునాను

అంటాడు. టీచర్స్‌ని వెదకొద్దూ ? మనకి చేరే పిల్లలు ఎంత ఇస్తారు ?"

"మనం టీచర్స్‌కి పే చెయ్య వద్దూ ? అన్నయ్యే నే నుంటానుగా ? కాస్సేపు చూస్తా నంటాడు. తన ఆఫీసు టైము, కాన్వెంటు టైము ఒకటి కదా ? ఎలా కుదురుతుంది ?" మళ్ళీ నిట్టూర్చాడు బరువుగా.

ఇద్దరూ మళ్ళీ నెమ్మదిగా చేరిపోయారు.

"బాబాయ్ ను వ్వేం బాధపడకు మే మున్నాంగా ?" అన్నాడు పెద్దాడు భరోసా ఇస్తూ.

"పోనీ బాబాయ్. డాడీకి వీలుగా ఉంటుంది కదా ! మన స్కూలు పొద్దుట, సాయంకాలం పెడితే బావుంటుందేమో ?" మా చిన్నాడి ఆలోచనలు వాడి తలలో ఉంటాయో, ఆ బొటన వేలిలో ఉంటాయో నా కనుమానమే.

"నోర్మూయ్. వద్దానికి దద్దమ్మలా తయారౌతావ్. అయినా బాబాయ్, నేను మొత్తం అందరికీ ఇంగ్లీషు చెప్తాను. ను వ్వేం బాధపడక్కర్లేదు. మధ్య మధ్యలో కొన్ని క్లాసులు నీవు చూసుకో." మా పెద్దాడి అడ్జస్ట్‌మెంట్.

"బాబాయ్. నేనూ అంతే, హిందీ చెప్తాను. హిందీలో నాకు ఫస్ట్ వస్తుంది తెలుసా ?"

"వెధవ హిందీ ఎవడికి రాదు ?

"నాకు బాగా వచ్చు..."

పెద్దాడు వెక్కిరించాడు. చిన్నాడు కొట్ట బోయాడు.నేను చిన్నాణ్ణి వారించి పెద్దాణ్ణి వడిలోనికి తీసుకున్నాను. చిన్నాడు ఉక్రోషంగా చూశాడు. ముక్కు ఎగబీల్చాడు.

"బాబాయ్ ! అమ్మ ఆయాగా ఉంటుంది. మధ్య మధ్యలో ఎల్.కే.జీ, యు.కే.జీ వాళ్ళకు తెలుగు అక్షరాలు నేర్పుతుంది. నీ వేం బాధ పడకు. రేపు పెట్టెయ్యి కాన్వెంటు."

వాడి సలహా నా కోపం తెప్పించింది. వీ ణ్ణసలు చితకతన్నినా పాపం లేదు !

ఇంతలో వాళ్ళ నాన్నగారు అంటే శ్రీవారు వచ్చారు. పిల్లలు చల్లగా జారుకుని మంచా లెక్కేశారు.

మా మరిది పెరు గన్నం అంత నిట్టూర్పు మరిచిపోయి తినేశాడు. నేను అంత కన్నా సీరియస్‌గా వంటిల్లు సర్ది ఆయన కోసం కంచం పెట్టి గ్లాసుతో మంచినీళ్ళు పెట్టాను.

ఆయన కుర్చీ మీద కూర్చుని వెంటనే, లేచిపోయారు. అన్నం గిన్నె కాలి మీద పడేసుకోకుండా బాలెన్స్ చేసుకున్నాను నేను.

"నేను ఇందాక తినేసేను కదా !" అన్నా రాయన నవ్వుతూ.

'నా మతిమరుపు మండిపోను' అనుకున్నాను నేను.

"ఒక కాగితం అందుకో" అన్నారు.

వెతక్కుండా చిన్నాడు దుప్పటిలో నుంచి పెన్ను బయటికి ఎత్తడు. వెతికి కాగితం తెచ్చాను.

ఆయన మంచం మీద బాసింపీట వేసు క్కూర్చున్నారు.

ఆ క్షణంలో ఐన్‌స్టీన్, ఎడిసన్ ఇలాంటి వా ళ్ళంత గుర్తు కొచ్చారు ఆయన్ని చూస్తుంటే. నిట్టూర్చబోయి భయపడి మానేసి వంటింట్లోకి పోబోయాను.

"ఇదిగో కాన్వెంటుకి ఒక పేరు చెప్పు" అన్నారు ఆయన.

నేనా ? నే నిన్ని తెలుగు నవలలు చదువుతా నా ఒక్క హీరోయిన్ పేరూ గుర్తుండదు. అప్పు డప్పుడు వాళ్ళ కష్టాలకు ఏడుస్తాను కూడా. ఎంత ప్రయత్నించినా ఇప్పుడు కూడా ఏడుపే గుర్తు కొచ్చింది. గాని పేరు గుర్తుకు రాలేదు.

ఆయన నా మీద పెద్ద ఆశలు పెట్టుకోకుండా తనే ప్రయత్నించి "శాంతి" అని గొణుక్కున్నారు.

"వద్దు నాన్నా ! ఆ పిల్ల అసలు మంచిది కాదు. అస్తమానూ గిచ్చుతుంది. దొరికితే కరుస్తుంది." మా చిన్నాడు దుప్పటి తీసేసి తన అయిష్టాన్ని ప్రకటించాడు.

ఆయన వాడి వంక ఒకసారి చూసి "ప్రశాంతి" అన్నారు.

"ప్రశాంతి ఆశ్రమం అయితే బావుంటుంది గాని, కాన్వెం టేమిటి ?" మా పెద్దాడి స్టేట్‌మెంట్.

"కందుకూరి, గురజాడ." ఆయన లిస్ట్ మరీ స్లో మూవింగ్.

"వద్దు డాడీ." పెద్దాడి సజెషన్.

మా చిన్నాడు మధ్య రెండు వేళ్ళూ జోరుగా రెండు సార్లు చీకేసి "డాడీ" 'గబ్బర్‌సింగ్' పేరైతే పిల్లలు దడుసుకుని చదివేసుకుంటారు" అన్నాడు. వాడి కళ్ళు వింత కాంతితో మెరిసిపోతున్నాయ్.

ఆయన అందర్నీ ఒకసారి చూసి "ప్రవీణ" అని రాశారు.

ఆ పేరు చూడగానే నాకు గుండెల్లో నుంచి పట్టలేనంత ఆవేశం పొంగి సెగలు పొగలుగా చెవుల్లోంచీ, కళ్ళల్లోంచీ వచ్చేసింది. అవును. అది ఎవతో మరి ! ఈయనతో ఏం సంబంధమో ? ఎంత పదిలంగా పేరు పెట్టించుకుంటోంది. రేప్పొద్దుట ఆ కాన్వెంట్, ఈ ఇల్లు, పిల్లలు, ఆయన... అన్నీ దు ఃఖం సుళ్ళు తిరిగింది.

ఇంతలో ఆయన ఆ పేరు కొట్టేశారు. "ఈ డైనింగ్ టేబుల్ వీధిలో వేద్దాం.. అందాకా.." అన్నారు.

"భోజనాలు అక్కడ తింటే అందరూ చూస్తారు.." విచారించాడు చిన్నాడు.

"తప్పదు కొన్నాళ్ళు అడ్జస్ట్ అవ్వాలి. నీకు ముఖ్యంగా చెప్తున్నాను." అన్నారు నన్ను చూస్తూ.

తప్పుతుందా ? ఒక స్టీలు గిన్నె లేదూ, కాటన్ చీరా లేదూ రోజూ ఈ దుమ్మూ, ధూళీ తప్పదన్నమాట !

"వా డేడీ ?" అన్నారు..

"బాబాయ్ బాబాయ్" అని అరిచేశారు పిల్లలు.

'ఇవాళే ఉరిశిక్ష' అన్నట్టుగా వచ్చి నిల్చున్నాడు పాపం, మరిది.

ముందు అడ్వర్టయిజ్ చేయాలి. 'చక్కని అవకాశం, సీట్లు పరిమితం' అని అంటే .గాని ప్రజలకు అర్థం కాదు. ఇంకా కాస్త టెంపో ఉండాలంటే 'ఆలసించిన ఆశాభంగం - త్వరపడండి, మీ పిల్లల భవిష్యత్తు కోసం - భంగపడకండి' ఇలా ప్రింట్ చేయిస్తే బావుంటుంది. ఏ మంటావ్ ?"

మా మరిది నీరసంగా తల ఊపేడు. "అసలు మనం చాలా బెట్టుగా వ్యవహరించాలి. ప్రతి వాణ్ణీ పిలిచి సీటు ఇస్తున్నట్టుండకూడదు. చాలా జాగ్రత్తగా కుర్ర వాడి తెలివితేటలు పరీక్షిస్తున్న ట్టివ్వాలి. పరిమితంగా సీట్లు ఉంచాలి."

మా పెద్దాడు వాళ్ళ డాడీనీ, బాబాయ్‌నీ మార్చి మార్చి చూస్తున్నాడు.

మా చిన్నాడు ఏడుపు లంకించుకున్నాడు. 'ఏమిరా' అని అడిగితే.. అలా అందరూ వచ్చేస్తే వాడికి సీటు ఉండదని త్వరపడి ఆ రాత్రే జాయిన్ చేసెయ్యమని వాడి ఏడుపు !

మా పెద్దాడు వెక్కిరించాడు.

మావారు ఇద్దరి మీదా గయ్ మన్నారు. ఆయన గదిలో నుంచి లేచిపోయారు.

మా మరిది లక్ష్మణస్వామిలా అనుసరించాడు.

నేను సీతదేవిలా నిల్చున్న పాటున పోక ఎందుకైనా మంచిదని కాలిక్యులేటర్, పంచాంగం, కేలండర్, మరో తెల్ల కాగితం తీసుకెళ్ళాను.

ఏ విధంగా అడ్వర్టయిజ్ చేస్తే బావుంటుంది. ఫీజు ఎంత పెట్టాలి. ఇలా ఇద్దరూ డిస్కస్ చేస్తున్నారు. మా మరిది చెమటలు కక్కుకుంటూ నిట్టూర్పులు ఆపుకుంటున్నాడు.

నేను నెమ్మదిగా అక్కడి నుంచి లోపలకు జారుకున్నాను. మా చిన్నాడి నోట్లో వేలు తీసేసి తల సర్దివాడి పక్కన కాస్త చోటుచేసుకున్నాను.

చుట్టూ వందలు వందలు పిల్లలు. మా మరిది నిట్టూర్చడానికి టైమ్ లేకుండా అవస్థ పడుతున్నాడు. మా చిరంజీవులు చిన్న బెత్తాలతో, నన్నని కళ్ళజోళ్ళతో చురుక్కుమనే చూపులతో. నిజంగా టీచర్స్ అంటే వాళ్ళు. చేర్పించడానికి వచ్చే వాళ్ళకి ముద్దు రావాలి.

మా చిన్నాడు నా చెయ్యి లాక్కుని నోట్లో



వేసుకున్నాడు.

నా క్కోపం వచ్చి రెండో పక్కకి తిరిగాను. పెద్ద పంచెకట్టు, తలపాగా, వాచీ, గొలుసు, లావు అద్దాల కళ్ళజోడు, కండువా, ఎర్రని పొడవు జుట్టు, కొంచెం ముందుకు వంగి మావారు బెత్తం అందుకున్నారు. ఆ వెనుక ముడి, ముడిలో పూలు, పెద్ద పమిట, సుద్దముక్కలతో నేను బోర్డు దగ్గరకు నడిచాను.

ఇలా కాదని కాళ్ళ దగ్గర దుప్పటి అందుకుని ముసుగు పెట్టేశాను. తెల్లవారే వరకు కలలకు ఒట్టుపెట్టుకుని.

"శుభోదయం !"

ఎంత శ్రావ్యంగా వినిపిస్తోంది ! కన్నులు మూసుకునే వింటున్నాను.

'ఈ ఉదయం.. మీ హృదయం.

ఆ హృదయంతో ఈ హృదయాన్ని అందంగా మార్చండి.

మీ చిన్నారులే మీ హృదయాలు..

వారి భవిష్యత్తే మీ ఉదయాలు..

ఇక నిర్ణయం మీదే..

ఈ కాన్వెంటు మీదే !"

నా కప్పటికి అర్థం అయింది.. మా వారు నిజంగా వర్డ్స్ వర్త్ అని.

"జీవితంలో ప్రతి సెకను ఎంతో విలువైనది.

ఒక సెకను ఆలస్యం చేయకండి.

ఈ క్షణంలోనే మీ చిన్నారికి బంగారు భవిష్యత్తు బాటలు వెయ్యండి.".

ముత్యాల సరాలులా ఎంత ముద్దుగా కూర్చేరు నేను కళ్ళు తెరిచి మరీ వింటున్నాను ఆ అడ్వర్టైజ్‌మెంట్.

"లేవండి నిదురలేవండి
చేరండి నేడే చేరండి
త్వరపడండి - బాగుపడండి"

మావారు కొంపదీసి నగ్నముని, జ్వాలాముఖి ఆ కోవలో వా రేమో ! మా పెద్దాడు కాలు మీద కాలు వేసుకుని వింటున్నాడు. మా చిన్నాడు మధ్య మధ్య వినిపిస్తున్న మ్యూజిక్‌కి ట్విస్ట్ చేస్తున్నాడు.

రాత్రి నా కలలన్నీ నిజ ,మనిపించాయి. తెల్లవారే సరికి ఎంత బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశారు మావారు.

తలెత్తి చూశాను. ఆయన పడక గది గుమ్మం దగ్గర నిలబడి మౌనంగా ఉన్నారు. మా మరిదిని ఆ క్షణంలో చాలా మెచ్చుకున్నాను. ఎంత శ్రమ పడుతున్నాడు ! పాపం రాత్రికి రాత్రి... ఆ కాన్వెంట్‌ని వేయి మనస్సులతో దీ వించాను.

'మీ సేవయే మా ధ్యేయం.

మీ దయ మా భాగ్యం...

మీ కోసమె... కేవలం... మీ కోసమే ఈ సంస్థ.... ఇంగ్లీషు మీడియం.. తెలుగు మీడియం... హిందీ మీడియం..."

ఇన్ని మీడియమ్సా ? వీళ్ళకు మతిగాని పోయిందా ? నే నాశ్చర్యపోయాను. మావారు కొంచెం ఖంగుతిన్నారు..

"సీట్లు పరిమితం - భాషలు అపరిమితం.

ఫీజు పరిమితం.. మా సేవ అపరిమితం..

మీ ఆనందం.. ఆరోగ్యం.. ఔన్నత్యం.. మా అపరిమిత ఆశయాలు. ఆ ఆశయాల కోసమే కంకణం కట్టుకుని దీక్ష బూనాము. మమ్మల్ని ఆశీర్వదించండి.. మా దీక్షను దిగ్విజయం చేయండి."

నాకు ఆశ్చర్యం.. ఎక్కువైపోతుంది. మావారి ముఖం ముఖంలా లేదు.

ఇంతలో దొడ్డిలో నుంచి మా మరిది తలుపు తీసుకు వచ్చాడు. బహుశా టాయ్‌లెట్ నుంచి అనుకుంటా. మరుక్షణం మతిలేని వాళ్ళలా వీధిలోకి పరుగెట్టాం.

"మీ పిల్లల్ని చేర్చండి. మీ స్నేహితుల పిల్లల్ని చేర్పించండి, ది బ్లూ బెస్ట్ శారదా కాన్వెంట్."

మా ఇంటి ఎదురుగుండా.

"మమ్మీ.. మమ్మీ మనింట్లో పెడదాం అన్నావ్‌గా ఎదు రింట్లో పెట్టా రేం ?" మా చిన్నాడి ప్రశ్న.

"పర్లేదులేరా.. ఎంత ఒక అంగలో వెళ్ళి వచ్చేయొచ్చు.." పెద్దాడి సమర్థింపు.

"వాళ్ళంత ఎవర్రా ?" చిన్నాడి సందేహం.

"డాడీ టీచర్స్‌ని కుదిర్చేసుంటారు." పెద్దాడి ఆలోచన.

నాకు విషయం అర్థమై మావారి ముఖంలోకి చూడలేక వంటింట్లోకి పోయి కుంపటి రాజెయ్యబోయాను.

ఆ కాగితాల నిండా మావారు రాసిన అనేక నినాదాలు. ధైర్యంగా ఉపయోగించేశాను.

ఆ తరువాత మావారు చాలా రోజులు మాటలు మరిచిపోయారు. మా పిల్ల లిద్దరూ పోరాడి అందులో చేరిపోయి, దాన్నే బాబాయ్ కాన్వెంట్‌గా భావించుకున్నారు. మా మరిది నెలలు తరబడి నిట్టూరుస్తుంటాడు దాన్ని చూసి నవ్వు డల్లా. నాకు మాత్రం. నా సామాన్లు చూసుకుని తృప్తి.

పిచ్చి మొద్దులు.. ఎక్కడి వక్కడే పదిలంగా ఉన్నాయి మరి ! *


# PASS PRIVATELY
## EFFICIENT POSTAL TUITION JOIN AT ONCE

***BEST RESULT!*** ***FINE OPPORTUNITY ! !***

1. **BA/BCOM:** SSLC/SSC/HSC (or) with 21 years of age (open university) eligible.
2. **MA/MCom:** Any Degree Holder (or) with 25 years of age (open university) eligible.
3. **MBA/MBM:** (No Entrance) - Degree holders eligible.
4. **Hr. Secondary** 5. **D.COM(IMC)** 6. **AMIE(I)**
7. **B.COM(Hons)** 8. **ALLOPATHY** 9. **ANDHRAMATRIC**

PROSPECTUS -- FREE -- APPLY

# SRI MURUGAN TUTORIALS

(Estd. 1952 ● Govt. Regd. No. 3072)

**H.O.: RISHIVANDIYAM - 606 205 (T.N.)**

**R.O.: 416-A, MOUNT ROAD, MADRAS - 35.**

**B.O.: 41, ARCOT ROAD, MADRAS - 24.**